సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

పోలీసు సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు 'గ్రీవియన్స్ డే' నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు, ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది బదిలీలు, వ్యక్తిగత, స్పౌస్, చిల్డ్రన్స్ మెడికల్ సమస్యల గురించి స్వయంగా విన్నవించుకున్నారు. ఎస్‌పి సిబ్బంది సమస్యలను విని, తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు. సిబ్బంది ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆదేశించారు. పోలీస్‌శాఖలో ఎవరికి ఎలాంటి సమస్యలొచ్చినా తమను సంప్రదిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలను తిరస్కరించండి
- వైసిపి, టిడిపి, జనసేన దొందూదొందే
- మదనపల్లె బహిరంగ సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్

మదనపల్లె : ప్రజారక్షణ భేరి సభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్

ప్రజాశక్తి-కడప ప్రతినిధి/మదనపల్లె అర్బన్/ములకలచెరువు

పెండింగ్‌లో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ అన్నారు. శుక్రవారం అన్నమయ్య జిల్లాలోని ములకలచెరువు, మదనపల్లిలో లౌకిక వాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని రాష్ట్ర అభివృద్ధి పేరుతో సిపిఎం రాష్ట్ర కమిటీ చేపట్టిన ప్రజారక్షణ భేరి బహిరంగ సభ సిపిఎం సీనియర్ నాయకులు హరీంద్రనాథ్ శర్మ అధ్యక్షతన నిర్వహించారు. ములకలచేరువు నుండి మదనపల్లికి చేరుకున్న బస్సు యాత్రకు స్థానిక అన్నమయ్య సర్కిల్‌లో ద్విచక్ర వాహనాలు, ఆటోల భారీ ర్యాలీని స్థానిక చిత్తూరు బస్టాండ్ సభ ప్రాంగణం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కరువు విలయతాండం చేస్తుంటే ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు. ఫలితంగా వేలాదిమంది నగరాలకు వలసలు పోతున్నారన్నారు రాజకీయంగా విపక్షాలను, ప్రజా సంఘాలను ఎక్కడికక్కడ జగన్ ప్రభుత్వం నిర్బంధించడం అణచివేయడం వంటి కక్షసాధింపులు చేపట్టడం దారుణమన్నారు బడా పారిశ్రామికవేత్తలకు వేలాది ఎకరాలు భూమిని కట్టబెడుతున్న ప్రభుత్వం పేదలు చిన్న గుడిసెలు వేసుకుంటే వాటిని కూడా నిర్ధాక్షిణ్యంగా కూల్చి వేస్తోందని చెప్పారు. కేవలం బటన్ నొక్కి కేటా యించిన నిధులు తక్కువని ప్రచారం మాత్రం ఎక్కువని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి మైనార్టీల, దళితుల పట్ల దాడులు చేస్తోందన్నారు. కార్పొరేటర్లకు కొమ్ము కాస్తూ లక్షలాది కోట్లు రాయితీగా ప్రకటిస్తున్న కేంద్రం కార్మికులకు, కర్షకులకు చేసింది ఏమీ లేదన్నారు.

రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు

- సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి

హాజరైన ప్రజలు, సిపిఎం నాయకులు

రాష్ట్రంలో 679 మండలాలు ఉంటే అందులో 300 పైగా మండలాల్లో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు కరువు పరిస్థితులు ఉన్నాయనిసిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. 300 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులు, వ్యవసాయ కార్మికులు, ఇతర చిన్నచిన్న వృత్తిదారులుకు ప్రభుత్వం ఆదుకోవాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు లేవు, చదువుకున్నామంటే సరైన విద్య వసతి లేదని తెలిపారు. పనిచేసే బతుకుదాం అంటే సరైన పరిశ్రమలు లేవన్నారు. అత్యంత వెనుకబడ్డ ప్రాంతాన్ని ఆదుకుంటా ఉద్ధరిస్తామని బిజెపి రాయలసీమ డిక్లరేషన్ ఇచ్చిందని తెలిపారు. బిజెపి ఇచ్చిన డిక్లరేషన్‌లో రాష్ట్రానికి ప్రత్యేకమైన నిధులు కేటాయిస్తామని వెనుకబడ్డ రాయలసీమ ఉత్తరాంధ్రలో వ్యాపార, ఉపాధి కోసం పరిశ్రమలు పెడతామన్నారు.

ఆకాశాన్నంటిన నిత్యావసర ధరలు

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఉమామహేశ్వరావు

నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, డీజల్, పెట్రోలు, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచేశారనిసిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఉమామహేశ్వరావు తెలిపారు. వైసిపి కానీ, టిడిపి కానీ ఖండించడం లేదన్నారు. రాష్ట్రంలో హంద్రీనీవా, నగరి, గాలేరు, తెలుగు గంగ, పోలవరం తదితర ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయలేదన్నారు. బిజెపికి ప్రత్యామ్నాయంగా కలిసొచ్చే బావ సారూప్య పార్టీలను కలుపుకుని వేదికను ఏర్పాటు చేయడం కోసమే ఈ నెల 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఆ బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సిపిఎం రాష్ట్ర నాయకులు నాగశివరాణి మాట్లాడుతూ దేశంలో గ్యాస్, ఆర్టీసీ, విద్యుత్ ఛార్జీల ధరలు పెరుగుతున్నాయని, అదేతీరున ఉపాధి హామీ ధరలు పెరగడం లేదని చెప్పారు. ఏటా ఉపాధి హామీ నిధుల కేటాయింపుల్లో కోత పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కడపలో ఉక్కు పరిశ్రమను, కర్నూలులో హైకోర్టు, తిరుపతిలో యునివర్సిటీ ఏర్పాటు చేస్తామన్న హామీలేమయ్యాయని ఎద్దేవా చేశారు. సిపిఎం రాష్ట్ర నాయకులు రమాదేవి మాట్లాడుతూ రాష్టంలోని పెండింగ్ ప్రాజెక్టులు సత్వరమే పూర్తిచేయాలని, భవన నిర్మాణ కార్మిక బోర్డు ద్వారా భద్రత కల్పించాలని, ఆటో కార్మికులకు భారాలను తొలగించాలని డిమాండ్ చేశారు. అసంఘటిత కార్మికులకు బోర్డు, పెన్షన్ సదుపాయాలు కల్పించాలన్నారు. కేంద్రం కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి కార్మికులకు ఉరి తాడు బిగిస్తోందని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఖనిజాలకు, ఉద్యాన పంటలకు నిలయమని, ఇటువంటి ప్రాంతఃలో వ్యవసాయాధారిత పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు కృష్ణయ్య, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కరయ్య,, జిల్లా నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రామాంజులు, వెంకటరామయ్య, చిట్వేలి రవికుమార్, డిసి.వెంకటయ్య, నరసింహా, ప్రజలు, రైతులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

మదనపల్లె పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

కళాజాతా నిర్వహిస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు

బిజెపితో వైసిపి దోస్తీ ఓటమికి దారి

- జిల్లా అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసింది ఏమీ లేదు
- పట్టణంలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు ఖర్చు పెట్టాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - బద్వేలు

బిజెపితో వైసిపి దోస్తీ ఓటమికి దారి తీస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామ్మోహన్ పేర్కొన్నారు. స్థానిక కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో శుక్రవార సిపిఎం బద్వేల్ పట్టణ కమిటీ సమావేశం పసుపుల మోక్షమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బిజెపితో దోస్తీ చేసిన ఏ ప్రాంతీయ పార్టీ కూడా మనుగడ కొనసాగించలేదని చెప్పారు. దేశంలో అనేక రాష్ట్రాలలో దోస్తీ చేసిన ప్రాంతీయ పార్టీల ఎమ్మెల్యేలను, ఎంపీలను బిజెపిలోకి పార్టీ కిరాయింపులకు పాల్పడి మిత్ర ద్రోహం చేస్తోందన్నారు. మన రాష్ట్రంలో అదే పరిస్థితి నెలకొంటుండడంతో మైనార్టీలు, దళితులు దూరమయ్యారని, వైసిపి ఓటమికి దారితీస్తుందని చెప్పారు. వైసిపి ఎమ్మెల్యేలు బిజెపి వేసిన ఉచ్చులో పడి పోతున్నారని తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వానికి, రాష్ట్రంలో ఊడిగం చేయడం తప్ప రాష్ట్ర అభివృద్ధి, జిల్లా అభివృద్ధి వైసిపి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. వైసిపి దృష్టిలో అభివృద్ధి అంటే బటన్ నొక్కడం, నవరత్నాలే అని అన్నారు. గ్రామీణ ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయం, పాడి పరిశ్రమ అభివృద్ధిని, పట్టణ ప్రాంతాల్లో ఉండే అసంఘటిత కార్మికుల ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం అని పేర్కొన్నారు. చదువుకున్న నిరుద్యోగ యువతకు శాశ్వత ఉద్యోగ అవకాశాలు కల్పించడమేనని పేర్కొన్నారు. బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు రూ.130 కోట్ల ఖర్చు వివరాలు పట్టణ ప్రజలకు శ్వేత పత్రం ద్వారా తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వైసిపి సొంత పార్టీ కౌన్సిలర్లే దీనిపై ప్రశ్నిస్తున్నారని వారికి కూడా సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో మున్సిపాలిటీ పాలకవర్గం ఉందన్నారు. కార్యక్రమంలో బద్వేల్ పట్టణ కార్యదర్శి కె. శ్రీనివాసులు, బద్వేల్ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పటాన్ చాంద్ భాష , కే.నాగేంద్రబాబు, పట్టణ కమిటీ సభ్యులు షేక్.మస్తాన్, జి.అనంతమ్మ, ఎలక రాజు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం. చిన్ని పట్టణ నాయకులు షరీఫ్ ఆంజనేయులు సురేంద్ర సురేష మహిళా సంఘం నాయకురాలు గౌతమి మస్తాన్ బి బాలమ్మ సిఐటియు నాయకులు సుబ్బరాయుడు, రాజగోపాల్ , కొండయ్య , కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

6న జిల్లా స్థాయి సదస్సు జయప్రదం చేయండి

-వామపక్ష కార్మిక, రైతు సంఘాల జిల్లా నాయకుల పిలుపు

ప్రజాశక్తి- కడప అర్బన్

వామపక్ష కార్మిక, రైతు సంఘాల జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఈ నెల 6న సిఐటియు జిల్లా కార్యాలయంలో నరేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జిల్లా స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు వామ పక్ష కార్మిక రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు నాగ సుబ్బారెడ్డి, మనోహర్, దస్తగిరి రెడ్డి, సుబ్బారెడ్డి, అన్వేష్ తెలిపారు. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, పేదలు, కార్మికులు, సామాన్య ప్రజల సమస్త ప్రయోజనాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకులలోని లక్షల కోట్ల రూపాయలను కార్పొరేట్లకు ఉదారంగా అందజేస్తూ, ఈ 9 సంవత్సరాల కాలంలో దాదాపు రూ.12 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ పేరుతో రుణమాఫీ చేసిందని చెప్పారు. వ్యవసాయ సంక్షోభం ఫలితంగా అప్పుల ఊబిలో కూరుకు పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల రుణాలు మాఫీ చేయడానికి మోడీ ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. కార్పొరేట్ కంపెనీల రుణాలు మాఫీ చేయడం కాదని, రైతుల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఓడరేవులు, ఎయిర్ పోర్టులు, విద్యుత్ సంస్థలు, రైల్వే, బొగ్గు గనులు, చివరకు ఆదివాసి, గిరిజనుల అటవీ భూములపై హక్కులను హరిస్తూ తాజాగా అటవీ చట్టానికి సవరణ పాస్ చేసిందని విమర్శించారు. ఈ చర్యలన్నీ కార్పొరేట్లకు ప్రత్యేకంగా మోడీ మానస పుత్రుడు గౌతమ్ అదానీని ప్రపంచ కుబేరులలో మొదటి స్థానానికి చేర్చేందుకు దోహదపడ్డాయన్నారు. సామాన్య ప్రజలపైన పన్నుల భారాన్ని పెంచుతూ, కార్పొరేట్లకు ఐటి, ఎక్సైజ్, కస్టమ్స్, కార్పొరేట్ టాక్స్ ల పైన లక్షలాది కోట్ల రూపాయల రాయితీలను ఇసుందని అన్నారు. మరోవైపు కార్మికుల హక్కులను హరిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. ఫలితంగా బలహీన వర్గాల ప్రజల ఉపాధికి నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు లాభాలు పెంచి ప్రజల సంపదలు లూటీ చేస్తున్న కార్పొరేట్లను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈనెల 26, 27 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి మహాధర్నాను జయప్రదం కోసం జిల్లాస్థాయి సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాల కృష్ణయ్య, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఎఐటియుసి నగర అధ్యక్షులు మద్దిలేటి, సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పాల్గొన్నారు.

కత్తితో దాడి గర్హనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎపి ఆర్‌టిసి తణుకు డిపో మేనేజర్ గిరిధర్ పై కత్తితో దాడి చేసి గాయపరచిన డిపో డ్రైవర్ నాగరాజు చర్యలు గర్హనీయమని ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ అధ్యక్షులు కె.కె.కుమార్, ఎన్.రాజశేఖర్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ ఉద్యోగిగా ఇటువంటి దాడులు సమర్థనీయం కాదని తెలిపారు. ఏ ఇబ్బందులు వచ్చినా అనేక స్థాయిలలో పరిష్కారం కోసం ప్రయత్నం చేసి సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు. ఇలా దాడులు చేస్తే సమస్య మరింత జటిలం అవుతుందని పేర్కొన్నారు. 'టిమ్' డ్యూటీకి వెళ్లలేని డ్రైవర్లు ఆ విషయాన్నిపై అధికారులకు ,యూనియన్ నాయకులకు సమస్యలు తెలిపి పరిష్కరించుకోవాలని తెలిపారు.

చట్టసభల్లో బిసి మహిళలకు రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాశక్తి- కడప సిటీ

కేంద్ర ప్రభుత్వం కల్పించిన మహిళా రిజర్వేషన్లలో దామాషా ప్రకారం బిసి మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌ను కలసి వినతి పత్రం ఇస్తామన్నారు. బిసి జన గణనను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని కేబినెట్ మంత్రివర్గంలో నిర్ణయించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కమిటీ కృతజ్ఞతలు తెలియజేసింది అన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు పి గురుస్వామి, కోశాధికారి శ్రీనివాసులు, మహిళా అధ్యక్షురాలు వల్లూరు నారాయణమ్మ వల్లూరు నారాయణమ్మ, రాష్ట్ర నాయకురాలు జయశ్రీ, ఉపాధ్యక్షులు కళ్యా సుధాకర్, అంజి, ముఖ్య సలహాదారు సుంకేసుల ఖాదర్ బాషా నరసింహా, మల్లిఖార్జున పల్లా నరసింహారావు , సుంకర రామచంద్రుడు పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న బిసి సంక్షేమ సంఘం నాయకులు

అందరికీ విద్య, ఉపాధి డివైఎఫ్ఐ లక్ష్యం

ప్రజాశక్తి -కడప అర్బన్

అందరికీ విద్య, ఉపాధి లక్ష్యంగా డివైఎఫ్ఐ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించామని నగర అధ్యక్ష, కార్యదర్శులు యస్.షాకిర్, డి. ఎం. ఓబులేసు తెలిపారు. శుక్రవారం పాత బస్టాండ్ లోని డివైఎఫ్ఐ కార్యాలయంలో మాజీ డివైఎఫ్ఐ జిల్లా నాయకులు వెంకటసుబ్బయ్య మొదట పతాకావిష్కరణ కార్యక్రమం చేశారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు. రామకృష్ణ నగర్‌లో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో వారి ఆశయ సాధన కోసం భారత రాజ్యాంగంలోని ప్రతి పౌరుడికీ బతికే హక్కు కోసం అందరికీ విద్యా అందరికీ ఉపాధి ప్రభుత్వ బాధ్యతగా ఉండాలని కోరుతూ 1980వ సంవత్సరం నవంబర్ 1, 2, 3 తేదీల్లో పంజాబ్ రాష్ట్రం లుధియానా నగరంలో డివైఎఫ్ఐ ని దేశ నలుమూలల నుంచి వచ్చిన ఆనాటి యువతి యువకులు ఏర్పాటు చేశారని తెలిపారు. అప్పటినుంచి ఇప్పటివరకు అవిశ్రాంతంగా పోరాడుతూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ 43 సంవత్సరాల కాలంలో దేశంలో ఘనమైన చరిత్రను నిర్మించిందని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలో నిరుద్యోగాన్ని, పేదరికాన్ని, దళితులు, ఆదివాసీలు, మహిళలు, మైనార్టీల పై దాడులు దౌర్జన్యాలు పెరిగిపోయాయని చెప్పారు. దేశంలో యువత అభివృద్ధి చెందాలంటే అందరికీ వారి శక్తి సామర్థ్యాలకు తగిన ఉపాధి కల్పించాల్సి ఉందని చెప్పారు. మోడీ ప్రభుత్వం ఇందులో ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు జగదీష్ మాజీ కడప జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి , ఉద్యోగ పోరాట కమిటీ కన్వీనర్ సిద్దిక్ మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పన కేంద్రాలుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెట్టడం ఉన్న దేశీయ చిన్న చిన్న పరిశ్రమలు మూతపడేలాగా చేయడం వల్ల 6 కోట్ల ఉద్యోగాలు ఊడిపోయాయని తెలిపారు. కేంద్రంలో 10 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్న రాష్ట్రంలో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్న భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు విజయ్, నాయకులు ఉదయ్, యూసఫ్, హరి, జగదీష్ పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - కడప అర్బన్

కెఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కందుల గ్రూప్ విద్యా సంస్థల అధిపతి కీర్తిశేషులు కందుల శివానంద రెడ్డి 3వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం కళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ విభాగం ఉచిత కంటి వైద్య శిబిరం బోగా పార్వతమ్మ సంయుక్త ఆధ్వర్యంలో బోగా పార్వతమ్మ ఆధ్వర్యంలో ఉచిత రక్త దాన శిబిరాన్ని నిర్వహించనున్నామని కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నగరం నుంచి భారతి ఆస్పత్రి ప్రముఖ వైద్యులు డాక్టర్ స్వరూప రాణి, డాక్టర్ శివ తేజా రెడ్డి, డాక్టర్ హారికా రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రజల సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

'ముఖ్యమంత్రి గారూ ఇదేమి న్యాయం?'

ప్రజాశక్తి - కడప

ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి వైఎస్ఆర్ జీవిత కాల సౌఫల్య పురస్కారానికి రూ. 10 లక్షలు, వైఎస్ఆర్ సౌఫల్య పురస్కారానికి రూ. 5 లక్షలు ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, మౌలానా అబుల్ కలాం ఆజాద్, డాక్టర్ అబ్దుల్ హాఖ్ గార్ల పేరిట ఇచ్చే అవార్డులకు కేవలం 1,25,000, ఒక లక్ష రూపాయలు బహుమతి ఇవ్వడం ఎంతవరకు సమంజసం, ముఖ్యమంత్రి గారు ఇదేమి న్యాయం? అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్ ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముస్లిం ప్రముఖులు మేధావులు స్వాతంత్ర్య సమరయోధుల పేరిట ఇచ్చే మరో ఏడు పురస్కారాలకు రూ. 25 వేల చొప్పున ఇవ్వడం చాలా శోచనీయం అన్నారు. గత ప్రభుత్వం పైన తెలిపిన అవార్డులకు రూ. రెండున్నర లక్ష, రెండు లక్షలు ఇచ్చిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం 50 శాతానికి కుదించి ఇవ్వడం ఏం న్యాయమని ప్రశ్నించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ పురస్కారానికి రూ. మూడు లక్షలు, డాక్టర్ అబ్దుల్ హాఖ్ అవార్డుకు రూ. రెండు లక్షలు, ముస్లిం ప్రముఖుల పేర ఇచ్చే అవార్డును రూ.50 వేలకు పెంచి ముస్లిం మైనార్టీల పక్షపాతి అని చెప్పుకునే ముఖ్యమంత్రి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు.

వాలీబాల్ పోటీలో కడప క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప

శ్రీనగర్ (జమ్మూ కాశ్మీర్)లో జరుగుతున్న అండర్ – 17 వాలీబాల్ ఎస్‌జిఎఫ్ జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు క్వార్టర్ ఫైనల్ కు చేరుకుంది. శుక్రవారం నిర్వహించిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు 5లో వరుసగా మూడు సెట్లు గెలిచి క్వార్టర్ ఫైనల్స్ కు చేరుకుంది. ఆంధ్రప్రదేశ్ జట్టులో కడప జిల్లాకు చెందిన క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరచడం విశేషం. టీమ్‌కు హెచ్ఒడిగా మహబూబ్ బాషా, కోచ్ విక్టర్, మేనేజర్‌గా ప్రవీణ్ కిరణ్ వ్యవహరించారు.

ప్రతిభ చాటిన ఏపి జట్టులో కడప క్రీడాకారులు

డిఇఒపై చర్యలకు జాప్యమెందుకో? : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

అవినీతి, అక్రమాల ఆరోపణలను ఎదుర్కొంటున్న జిల్లా విద్యాశాఖాధికారి వై.రాఘవరెడ్డిపై విచారణ జరిపిన అధికారులు చర్యలు తీసుకోవడంలో జాప్యమెందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.సునీల్ కుమార్, సగిలి రాజేంద్ర ప్రసాద విమర్శించారు. డిఇఒపై చర్యలు చేపట్టకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఎఒ విజయ కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జి.సునీల్ కుమార్, సగిలి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖాధికారిపై పలు అవినీతి, అక్రమాల ఆరోపణలున్నాయన్నారు. ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడ్డారన్నారు. వీటిపై పత్రికలలో వార్తలు రావడంతో పాటు, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళనలు చేపట్టినా కనీస చర్యలు లేవన్నారు. ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. డిఇఒ వ్యవహారంపై ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ జులైలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే, ఆగస్టు 4ర జిల్లా కలెక్టర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఆనంద్ నాయక్ ని విచారణ అధికారిగా నియమించారని, రెండు నెలలు కాలయాపన చేసి అక్టోబర్ 7న డిఆర్‌డిఎ విచారణ చేపట్టారన్నారు. విచారణ జరిపి నెల కావస్తున్నా జిల్లా కలెక్టర్‌కు విచారణ నివేదిక సమర్పించకపోవడం వెనుక ఉన్న మతలబు ఏమిటో అధికారులే సమాధానం చెప్పాలన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న డిఇఒపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, రాష్ట్ర విద్యాశాఖాధికారులు ఉద్యోగోన్నతికి రంగం సిద్ధం చేశారంటే , విద్యాశాఖ పరిస్థితి, రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇప్ప టికైనా కలెక్టర్ స్పందించి డిఇఒపై విచారణ నివేదికను తక్షణం తెప్పించుకొని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలిసివచ్చే విద్యార్థి సంఘాలతో కలిసి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎస్. మనోజ్ పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా, పకడ్బందీగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని కలెక్టర్ వి.విజయ్ రామరాజు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు తెలియజేశారు .శుక్రవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి తమ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్ లు, ఎస్‌పిలతో రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్, ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్, డిఆర్‌ఒ, గంగాధర్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష హాజరయ్యారు. విసి ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పకడ్బందీ ఏర్పాటు చేస్తున్నామని, ఓటరు జాబితాకు సంబంధించి ఎటువంటి విమర్శలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్‌పి

ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష విజయవంతం

ప్రజాశక్తి-కడప సిటీ

స్టేట్ ఎడ్యుకేషనల్ అఛీవ్ మెంట్ సర్వే పరీక్ష విజయవంతం గా నిర్వహించామని జిల్లా విధ్యాశాఖాధి రాఘవ రెడ్డి, సర్వశిక్ష అభియాన్ జిల్లా ప్రాజెక్టు అధికారి ఎ.ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1361 పాఠశాలలో మూడు, ఆరు, తొమ్మిదవ తరగతి 33,690 మంది విద్యార్థులకు పరీక్ష నిర్వహించామన్నారు. విద్యార్థి, టీచర్, పాఠశాల ప్రశ్నావళి వంటి అన్ని విషయాలను పరిశీలించి తగిన సూచనలు చేశారు సీస్ సర్వేలో భాగంగా నిర్వహించే పరీక్ష ద్వారా విద్యా ర్థుల అభ్యసన సామర్థ్యాల అంచనా వేసేందుకు వీల వుతుందన్నారు. సర్వే ఫలితాలను బట్టి బోధన అభ్యసనాలను పెంపొందించేందుకు ప్రణాళికలను రూపొందించొచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక మండల విద్యాశాఖ అధికారి రవి శంకర్ నాయక్, కేవీబీవీ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ర్యాలీలో ఎన్‌జిఒ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

పాత పింఛను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ న్యూ ఢిల్లీ రామ్ లీలా మైదానంలో అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించిన ర్యాలీలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీని వాసరావు, ప్రధాన కార్యదర్శి కె. వి శివా రెడ్డి ఆధ్వర్యంలో 3 వేల మంది ఉద్యోగులు పాల్గొన్నారు. కడప జిల్లా నుంచి జిల్లా అధ్యక్షులు బి. శ్రీ నివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవి కుమార్ హాజరయ్యారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌జిఒ సంఘం నాయకులు

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డిఇఒ రాఘవరెడ్డి

పరీక్ష కేంద్రాల్లో డిఇఒ తనిఖీ

ప్రజాశక్తి - చాపాడు

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన జాతీయ సాధన పరీక్షను జిల్లా విద్యా శాఖాధికారి వై రాఘవ రెడ్డి, సమగ్ర శిక్ష పథక అధికారి ఎ.ప్రభాకర్ రెడ్డి తనిఖీ చేశారు. కస్తూరిబా బాలికల పాఠశాలను తనిఖీ చేసి ఎన్ఎఎస్ పరీక్షను పరిశీలించారు. అనంతరం చాపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలను పరిశీలించారు. ఐఎఫ్‌పి ప్యానెల్స్ ఎలా పనిచేస్తాయో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెను ప్రకారం భోజనం అందుతుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఇఒ వి.రవి శంకర్, వి.వంశీ కృష్ణ, కస్తూరిబా పాఠశాల ఎస్ఒ నాగలక్ష్మి, హెచ్ఎం గౌస్ మోద్దీన్, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది మహేష్, శ్రీను పాల్గొన్నారు.

చక్రాయపేట : ఎన్ఎఎస్ పరీక్షకు 421 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి జి. రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని 15 పాఠశాలలో 551 మంది విద్యార్థులు 3,6,9 ,తరగతులు ఈ పరీక్షలో హాజరైనట్లు తెలిపారు. పరీక్ష ఇన్విజి లెటర్ గా వేంపల్లి డిగ్రీ కళాశాల విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు సామర్థ్యాల మదింపు పరీక్ష అన్నారు. కస్తూరిబా బాలికల విద్యాలయంలో ఎంఇఒ తనిఖీ చేశారు. బాలికల విద్యాలయంలో 30 మంది విద్యార్థినులు పరీక్షలో హాజరైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ గౌస్ ప్యారి తెలిపారు. మండలంలో 15 పాఠశాలల్లో పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎంఇఒ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు, విద్యార్థులు, ఎంఆర్‌సిలు పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెట్టందే సిఎంకు నిద్రపట్టదు!

ఖాజీపేట : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి టిడిపి నాయకులపై అక్రమ కేసులు పెట్టందే నిద్రపట్టదని టిడిపి రాష్ట్ర మాజీ కార్య నిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. టిడిపి సీనియర్ నాయకులు, కెసి కెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి స్వగృహంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఉచిత ఇసుక పేరుతో రాష్ట్ర ఖజానాకు నష్టమంటూ నారా చంద్రబాబునాయుడుపై కేసు పెట్టడం ప్రపంచంలో ఎనిమిదో వింత అని ఆశ్చర్యం వ్యక్తపరిచారు. చంద్రబాబు నాయుడు హైటెక్ సిటీని నిర్మించారని, రాజధాని అమరావతిని అభివృద్ధి చేశారని, పోలవరం ప్రాజెక్టును నిర్విరామంగా నిర్మాణం చేశారని, శ్రీ సిటీ,ఎలక్ట్రానిక్ సిటీ, కియాకార్ల ఫ్యాక్టరీని అభివృద్ధి చేశారని, చంద్రన్న కానుకను ఇచ్చారని, చేతివృత్తుల వారికి ఆదరణ పథకాన్ని ప్రవేశపెట్టారని తద్వారా ఖజానాకు నష్టం వాటిల్లిందని వరుసగా చంద్రబాబు నాయుడుపై కేసులు పెట్టి జైలుకు పంపిస్తారేమో? అంటూ రెడ్యం మరోసారి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. చంద్రబాబు నాయుడు వ్యవస్థలను మేనేజ్ చేస్తారని సజ్జల మాట్లాడుతున్నారని, ఆ శక్తి ఉంటే చంద్రబాబు నాయుడు మధ్యంతర బెయిల్ పై బయటకు ఎందుకు వస్తారని ఆయన సూటిగా ప్రశ్నించారు. సమావేశంలో రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్యం నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నష్టపోతున్న రైతులను ఆదుకోవాలి

ఖాజీపేట : ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, ఆరుతడి పంటలకు కూడా సాగునీరు అందకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని, ఎండిపోయిన పంటలను గుర్తించి రైతులకు నష్టపరిహారం అందించాలని టిడిపి మండల నాయకులు, కడప మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ తవ్వారు పల్లె సందుల నాగశివారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కెసి కాలువలకు ఆరుతడి పంటలు సాగునీరు అందిస్తామని అధికారులు ప్రకటనలు చేసినా సాగునీరు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. కెసి కాలువకు సాగునీరు అందించారని ఆరుతడి పంటలు కింద జొన్న, మినుము పంటలు ఎండిపోయినందుకు చూడాలని పేర్కొన్నారు. నష్టపోయిన రైతులకు పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ అందించి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని, విద్యుత్ సరఫరా సమస్యల వల్ల కూడా పంటలు ఎండి పోతున్నాయని అధికారులు, ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.

డ్రైడేస్ క్రమం తప్పక పాటించాలి

చాపాడు : డ్రైడేస్ క్రమం తప్పకుండా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ల్యాబ్, ఫార్మసీ లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం చాపాడు గ్రామంలో డ్రైడే – ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా మురుగు గుంటలను, ప్రతి ఇంటిలోని తొట్లు, పాత టైర్లు ఇతర సామగ్రిని పరిశీలించారు. మురుగు నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది దోమలు వ్యాధి చెందుతాయని తెలిపారు. ప్రజలకు జబ్బులు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక వైద్య సిబ్బందికి సూచనలు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీవాణి, డాక్టర్ ఓబులేసు, ఎండమూల జీస్ట్ భాషా మొహిద్దీన్, ఎంఇఒ వెంకటరెడ్డి, ఎంపిహెచ్ ప్రసాద్, పిహెచ్ఎన్ సుకన్య, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చాపాడు : మండల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు 220 కెవి సబ్ స్టేషన్‌లో, మండల పరిధిలోని చిన్నపాటి మరమ్మతుల కారణంగా సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. **వేంపల్లెలో..** మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లలో మర్మమతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ జెఇ శివ, చంద్రశేఖర్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఇడుపులపాయ, వీరన్నగట్టుపల్లె గ్రామాలలో పాటు వేంపల్లెలోని వైఎస్ రాజారెడ్డి నగర్, చింతలమడుగుపల్లెలో ఉన్న 33/11 విద్యుత్ సబ్ స్టేషన్ ల్లో మరమ్మతులు చేయనున్నారని పేర్కొన్నారు. విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో ఉన్న అ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

విలేకరి కుటుంబాన్ని పరామర్శించిన సతీష్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

విలేకరి గఫార్ తల్లిని పరామర్శిస్తున్న సతీష్‌రెడ్డి

ప్రజాశక్తి విలేకరి అబ్దుల్ గఫార్ తండ్రి మస్తాన్ సాహెబ్ ఇటీవల మృతి చెందారు. ఈనేపథ్యంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ ఎస్.వి. సతీష్‌రెడ్డి విలేకరి కుటుంబ సభ్యులను పలకరించారు. అనారోగ్యంతో ఉన్న గఫార్ తల్లిని కూడ పరామర్శించారు. అనంతరం వృషబాచలేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కొండయ్య, చింతలమడుగుపల్లెలో ఉన్న మాజీ ఎంపిటిసి సంటెన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట రామకృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, మధు ఉన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

చాపాడు : మైదుకూరు మండల సర్వ సభ్య సమావేశం ఎంపిడిఒ ఎవి రమణారెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న గ్రామస్థాయి నాయకులు వారి గ్రామాలలోని సమస్యలను అధికారులకు విన్నవించారు. ఈ సందర్భంగా మండల అధికారులు మాట్లాడుతూ త్వరలో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ రాబోతుందని మండలంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేసిన పనులకు బిల్లులు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలు అయిన తర్వాత బిల్లులు చెల్లించడానికి ఆలస్యం అవుతుందని కాబట్టి తమ పరిధిలోని అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి థామస్, వైస్ ఎంపిపి రఘురామిరెడ్డి , మండల పరిధిలోని సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - చాపాడు

ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజలనుంచి వచ్చిన సమస్యలలో అవకాశం ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తో కలిసి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారమూ సమస్యల పరిష్కారం కోసం కడపకు ప్రజలు రావాల్సిన అవసరం లేకుండా అధికారులనే మండలానికి వచ్చే ఏర్పాటు చేశామన్నారు. చాలా వరకు సమస్యలు పరిష్కారం అవుతాయని, అలాంటి వాటి పట్ల అశ్రద్ధ చూపకుడదని చెప్పారు. సచివాలయ సిబ్బంది పనితీరు, ఇకెవైసి, జగనన్న ఆరోగ్య సురక్ష, ఎఎన్ఎం, మహిళా పోలీస్ సిబ్బంది పనితీరు అధికారులు పరిశీలించాలన్నారు. వాలంటీర్ల అటెండెన్స్ 68 శాతం మాత్రమే ఉందని సరిగా పని చేయని వారిని తొలగించాలని ఆదేశించారు. చియ్యపాడు, అయ్యవారిపల్లె, సోమాపురం నుంచి ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల నుంచి అందే సమస్యలను అధికారులు పరిశీలించాలన్నారు. కొంత మంది అభివృద్ధిని అడ్డుకునేందుకు అర్జీలు పెడుతుంటారని వారి గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల వద్దకే సమస్యలు తెలుసుకునేందుకు అధికారులు రావడం సంతోషంగా ఉందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 180 మంది అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో జెసి గణేష్ కుమార్, ఆర్‌డిఒ శ్రీనివాసులు, జిల్లా స్థాయి అధికారులు, ఎంపిపి టి.లక్ష్మయ్య, మండల ప్రత్యేక అధికారి సురేష్‌రెడ్డి, తహశీల్దార్ యామిని, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

'ఉక్కు'శిలా ఫలకాలా..సమాధి రాళ్లా ?

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కడప ఉక్కు పరిశ్రమ కోసం వేసిన రాళ్ల శిలా ఫలకాలా లేక సమాధి రాళ్లా అని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని, విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేట్ ఆపాలని కోరుతూ విద్యార్థి, యువజన సంఘాల అధ్వర్యంలో నవంబర్ 8న తలపెట్టిన విద్యాసంస్థలు బంద్ జయప్రదం చేయాలని కోరుతూ కన్యతీర్థం వద్ద ఉన్న వైఎస్సార్ స్టీల్ అథారిటీ వద్ద బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీనమేషాలు వేస్తున్నాయన్నారు. విభజన చట్టంలో స్పష్టంగా కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అని చట్టబద్ధంగా రాసుకున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇక్కడ ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. గడిచిన ఇన్ని సంవత్సరాల కాలంలో కడప ఉక్కుపై చర్య శూన్యమన్నారు. కరువు ప్రాంతమైన రాయలసీమ ప్రాంతంలో ఉక్కు పరిశ్రమ వస్తే చదువుకున్న వందలాది నిరుద్యోగులకు, విద్యార్థులకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కడప ఉక్కు కోసం రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు కేంద్రాన్ని నిలదీయడంలో విఫలం చెందాయని పేర్కొన్నారు. ఉద్యోగాలు రాక యువత ఇతర దేశాలకు, రాష్ట్రాలకు వలసలు పోతున్నారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చాక ఒక ఏడాదిలోగా ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి గడిచిన నాలుగు సంవత్సరాలు దాటిన పనులు ఎంతవరకు వచ్చాయో వేసిన శిలాఫలకాలను చూస్తే అర్థమవుతుందని తెలిపారు. చేసిన శంఖుస్థాపనలనే మళ్ళీ మళ్ళీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం యువతను మోసం చేస్తుందన్నారు. జిందాల్‌లో కుదుర్చుకున్న ఒప్పందంతో వేసిన పునాదిరాయికి పేరు, ఊరు లేకుండా ఉందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం ఎంతో మంది బలిదానాలు చేసి సాధించుకున్న దానిని ప్రయివేటీకరణ చేస్తూ రాష్ట్రానికి బిజెపి తీవ్ర ద్రోహానికి పాల్పడుతోందన్నారు. కేంద్రాన్ని నిలదీయకుండా రాష్ట్ర భవిష్యత్తును కేంద్రం వద్ద తాకట్టు పెట్టవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ ఉద్యమంలో కలిసి రావాలని కేంద్రాన్ని నిలదీయాలని, ఇక్కడి ప్రాంత యువత ఆకాంక్షను నిలబెట్టాలని లేకుంటే చరిత్ర హీనులుగా మిగిలిపోతారన్నారు. బంద్‌లో విద్యార్థులు, యువకులు, మేధావులు, కార్మికులు, కర్షకులు, రైతులు అందరూ భాగస్వాములై జయప్రదం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు అంజి, నరసింహ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వినయ్ కుమార్ పాల్గొన్నారు.

6 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి

- భూపేష్ సుబ్బరామిరెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి

నియోజకవర్గంలోని ఆరు మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి కోరారు. శుక్రవారం నియోజకవర్గంలోని రైతులతో కలిసి ఆర్‌డిఒ కార్యాలయంలోని ఎఒ ఇక్బాల్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది (2023) ఖరీఫ్, రబీ సీజన్లకు గాను రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు పడక రైతులందరూ చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాలను (కడప, కర్నూల్ , అనంతపురం, చిత్తూరు) కరువు జిల్లాలుగా గుర్తించారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రైతులందరూ వర్షాలు వస్తాయనే ఆశతో శనగ, కంది, మినుము, జొన్న, వరి, మిరప పైర్లు వేసుకొనగా అరకొరగా మొలకెత్తగా ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో రైతన్నలు దిగాలుపడుతున్నారన్నారు మరికొన్ని రకాల పంటలు వేసుకోడానికి మందులు విత్తగా వర్షం పడక విత్తనం వేసుకోవడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలను కరువు మండలాలుగా గుర్తించి, నీరు లేక ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులకు తగిన నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కనుచూపు మేరలో మైలవరం, గండికోట ప్రాజెక్ట్ ఉన్నప్పటికి సకాలంలో రైతులకు నీరు అందించే ఏర్పాటు చేయలేదన్నారు. పంటల పరిశీలనకు అధికారులు, నాయకులు రైతుల వద్దకు వెళ్లి వారిని పలకరించిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మల్లికార్జున, అన్నెబొయిన కొండయ్య, హనుమంతు నాయక్, నవీన్ రాయల్, తెలుగు రైతు విభాగ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసులపై దాడి చేసిన కేసులో నిందితులు అరెస్టు

సుమో, కేబుల్ వైరు , నగదు స్వాధీనం

నిందితులను అదుపులోకి తీసుకున్న డిఎస్‌పి వినోద్‌కుమార్

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

అంకాలమ్మ గూడూరు వద్ద పోలీసులపై దాడి చేసిన కేసులో నిందితులను అరెస్ట్ చేశామని డిఎస్‌పి వినోద్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ అనంతపురం జిల్లా సుశీల రెడ్డి కాలనీకి చెందిన సాకే రాజేష్ , అనంతపురం టౌనుకు చెందిన సాకే రమణను అరెస్టు చేశామన్నారు. ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు పులివెందుల వినోద్‌కుమార్ నేతృత్వంలో పులివెందుల రూరల్ సిఐ. బాల మద్దిలేటి ఆధ్వర్యంలో సింహాద్రిపురం ఎస్ఐ ఖ్ రోషన్ వారి సిబ్బంది సింహాద్రిపురం మండలం చెరువు కట్ట వద్ద వారిని అదులోకి తీసు కున్నారన్నారు. గత నెల 6న రాత్రి 10 గంటలకు విధి నిర్వహణలో భాగ ంగా రాత్రి గస్తీలో ఉన్న పోలీసులను దుండగలు దాడిచేశారని చెప్పారు. వారు నంబర్‌ప్లేట్ లేని స్కార్పియో వాహనంలో ఆపకుండా వెళ్లడంతో పోలీసులు లింగాల ఎస్ఐ, సిబ్బందిని అలెర్ట్ చేయగా వాహనాన్ని పులివెందుల రింగ్ రోడ్డు మార్గం లో ఆపేందుకు ప్రయత్నం చేశారని చెప్పారు. ఈనేపథ్యంలో జడ్‌పి హైస్కూల్ వద్ద పోలీసు వాహనంను గుద్ది పోలీసులపై రాళ్లతో దాడి చేసి పారిపోయారని పేర్కొన్నారు. లింగాల ఎస్ఐ రవికుమార్ ఫిర్యాదు మేరకు సింహాద్రిపురం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసుకు సంబంధించి గత నెల 14న మునలయ్య, సాకే హరి, సాకే మహేష్‌ను అరెస్టు చేశామని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి సింహాద్రిపురం, పులివెందుల టౌన్, తొండూరు మండలాలలో పందులు, పొలాలలోని మోటార్ కేబుల్ వైర్లను దొంగతనం చేస్తూ అడ్డొచ్చిన వారిపై దాడి చేస్తూ ఈ నేరాలు పాల్పొడుతున్నట్లు ఒప్పుకున్నారని తెలిపారు. చోరీ చేసిన కేబుల్ వైర్లు, సుమో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

'నాకు న్యాయం చేయండి సారూ!'

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలం లోమడ గ్రామంలో 6 ఎకరాల 47 సెంట్లు భూమిని తన సోదరుడు వీరనారాయణ భార్య విజయలక్ష్మి పేరు మీద నరేష్ కుమార్, రాఘవరెడ్డి, తేజస్విని అనే వారు ఫోర్జరీ సంతకాలు చేసి భూమిని రిజిస్టర్ చేసుకున్నారని బాధితుడు వై.దామోదర్ పేర్కొన్నారు. శుక్రవారం పులివెందుల వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ తండ్రి వెంకట కొండయ్యకు ముగ్గురు కుమారులమని చెప్పారు. తన పేరుమీద ఉన్న 6.47 భూమిని ఆధార్ కార్డులు మార్చుకొని రిజిస్టర్ చేయించుకున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఎలాంటి ఆధారాలు లేకోకుండా రిజిస్టర్ చేశారని వాపోయారు. బాగా పరిష్కారాలు చేసుకుందామని సర్వే నెంబర్ 7/5,7/3,7/2,7/1,5/6,5/4,లో ఉన్న భూమిని రికార్డుల్లో పరిశీలించగా 6 ఎకరాల 47 సెంట్ల తన భూమిని ఆధార్ కార్డులో పేరు మార్చుకొని మోసం చేశారని విచారం వ్యక్తం చేశారు. అధికారుల చుట్టూ పది నెలల నుంచి తిరుగుతున్నప్పటికీ న్యాయం జరగలేదని, వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని వారు కోరారు. తన తమ్ముడితో ప్రాణహాని ఉందని, తనకు ఏమి జరిగినా వారే బాధ్యులని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

చంద్రబాబు కేసులకు వైసిపితో సంబంధం లేదు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమో దైన కేసులకు వైసిపికి కానీ, సిఎం జగన్‌కు కానీ ఎలాంటి సంబంధం లేదని 13వ వార్డు కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాష తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టప్రకారమే బాబుపై కేసులు నమోదయ్యాయన్నారు. మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి జగన్ బెయిల్ విషయంలో అవహేళన చేయడం తగునా అని ప్రశ్నించారు. బెయిల్‌పై వచ్చిన చంద్రబాబు కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ జైలు బయటనే విలేకరులతో మాట్లాడారని ర్యాలీ నిర్వహించారని దీనిని కోర్టు ధిక్కరణ కింద పరిగణించి కోర్టు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని అన్నారు. సిఎం జగన్ అవినీతి కేసుల్లో ప్రస్తుతం కోర్టు కొట్టివేస్తూ వస్తోందని మిగిలిన రెండు మూడు కేసులు కూడ త్వరలోనే పరిష్కారం అవుతాయన్నారు. దాదాపు 65లక్షల మందికి ప్రతినెలా 1న అందిస్తున్నామని పింఛను అందజేస్తున్నారని చెప్పారు. 45లక్షల అక్కచెల్లెమ్మలకు అమ్మఒడి అందిస్తున్నామన్నారు. జగన్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమం చూడలేక టిడిపి నాయకులు విమర్శిస్తున్నారని పేర్కొన్నారు. ప్రొద్దుటూరు టిడిపి నుంచి ఐదుగురు ఎమ్మెల్యే టికెట్ కోసం పోటీ పడుతున్నారని విమర్శించారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా గెలిచేది వైసిపినే అని స్పష్టం చేశారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నందం అపరాజిత, మౌనిక

'నా భర్త కేసులో ఎలాంటి పురోగతి లేదు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

తన భర్త నందం సుబ్బయ్యను చంపిన కేసులో ఎటువంటి పురోగతి సాధించలేదని భార్య నందం అపరాజిత తెలిపారు. శుక్రవారం స్థానిక టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.వి. ప్రవీణ్ కుమార్‌రెడ్డి నివాసంలో ఆయన సతీమణితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుబ్బయ్యను చంపి తనను రోడ్డు పాలు చేశారన్నారు. తనకు, పిల్లలకు రక్షణ లేదని, తాము హైదరాబాద్‌లో లో భయం భయంగా బతుకుతున్నామని వాపోయారు. తన భర్త హత్య కేసులో సిబిఐ విచారణ చేయాలని అడిగానని పేర్కొన్నారు. కేసు వెనక్కి తీసుకోవాలని, అందుకు రూ. కోట్ల డబ్బులు ఇస్తామని పేర్కొన్నారు. అందుకు నేను అంగీకరించ లేదని చెప్పారు. న్యాయంగా పోరాడుతుంటే తనపై బురద చల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కక్షలు తనలో లేవని, న్యాయంగా పోరాడుతానని పేర్కొన్నారు. అనంతరం ప్రవీణ్ కుమార్ రెడ్డి భార్యమౌనిక మాట్లాడుతూ తన భర్త పై అక్రమ కేసు బనాయించారని, బెనర్జీ వైసిపి నాయకులకే ఫోన్ చేసి నందం సుబ్బయ్యకు పట్టిన గతే పడుతుందని బెదిరించాడని తెలిపారు. తన భర్త ప్రవీణ్ ఏ తప్పు చేయకున్నా అప్పట్లో జైలుకు వెళ్లారన్నారు. తప్పుడు ఆరోపణలకు ఎవరూ భయపడరని చెప్పారు.

కరువుతో ఇబ్బందిపడుతున్న రైతులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాథరెడ్డి

నియోజకవర్గంలో వర్షాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని, మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని రైతుల పట్ల వివక్షత చూపకూడదని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవీంద్రనాథరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని రైతులకు న్యాయం చేయాలన్నారు. కరువు మండలాల ప్రకటిస్తే ఉపాధి పనుల్లో పని దినాలు పెరుగుతాయని, రైతులు తీసుకున్న రుణాలకు అదే మొత్తంలో కొత్త రుణాలు ఇస్తారని చెప్పారు. పోలీసుల తీరు మారాలని అధికారి పార్టీ వారిని ఒక ఒకలా, ప్రతి పక్షం వారిని మరోలా చూడడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకుని విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ప్రసాద్ రెడ్డి, నాయకులు వెంకటరామిరెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ ఇన్వెస్ట్‌మెంట్‌పై అవగాహన

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎంబిఎ విద్యార్థులకు ఎస్ఐఎస్ఎం కోటాక్ సెక్యూరిటీ వారి ఆధ్వర్యంలో 'ఫైనాన్సియల్ ఎడ్యుకేషన్ ఫర్ యంగ్ సిటిజెన్' అనే అంశంపై ఎస్ఇబిఐ అండ్ ఎన్ఐఎస్ఎం ట్రైనర్ డాక్టర్ కె.ప్రభాకరన్ ఆధ్వర్యంలో వర్క్ షాప్ నిర్వహించారు. ఫైనాన్సియల్ ఎడ్యుకేషన్ , ఆన్ లైన్ ట్రేడింగ్ ఇన్వెస్ట్‌మెంట్ పై అవగాహన కల్పించాలచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైఫ్ సెటిల్‌మెంట్ స్మాల్ సేవింగ్ స్కీం, పిపిఎఫ్, పోస్ట్ ఆఫీస్ సుకన్య సమృద్ధి యోజన వంటి స్కీమ్‌లు గోల్డ్ ఇన్వెస్ట్‌మెంట్‌గా మార్చడం ఎలా అనే విషయం పై అవగాహన కల్పించారు. తమ కళాశాల విద్యార్థులకు ఫైనాన్సియల్ ఎడ్యుకేషన్ పై మంచి సలహాలు అందివ్వడం పట్ల కళాశాల చైర్మన్ డాక్టర్‌వి. జయ చంద్రా రెడ్డి , ప్రిన్సిపల్ డా . జి . శ్రీనివాసులురెడ్డి సంతృప్తిని వ్యక్తం చేశారు . అనంతరం ఆయన్ను సన్మానించారు.

ఆయకట్టు చెరువులకు నీరు విడుదల

ప్రజాశక్తి - బి.కోడూరు

మండలంలో అత్యంత ప్రధాన సాగునీటి ప్రాజెక్టు లోయర్ సగలేరు ప్రాజెక్టు నుంచి మునిల్లి చెరువు మొదలుకొని అన్ని ప్రధాన చెరువులకు వ్యవసాయ సాగునీటిని శుక్రవారం ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రజలు, రైతుల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. ఈ ఏడాది వర్షాభావం కారణంగా నీటి విడుదల ఆలస్యమైనప్పటికీ ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుని రైతులకు ఇబ్బంది లేకుండా అనతి కాలంలోనే ఎల్‌సిపి డ్యామ్‌కు కొత్త గేటు ఏర్పాటు చేసి నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల వైసిపి మండల నాయకులు చౌదరి, రామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి సింగిల్ వీడియో ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, మునిల్లి ఉప సర్పంచ్ ఓ వెంకట్రామ్‌రెడ్డి, యోగానందరెడ్డి, జడ్‌పిటిసి దావీదు, ఎంపిపి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా : జడ్‌పిటిసికి గాయాలు

ప్రజాశక్తి–కంభం రూరల్

గాయపడిన జడ్‌పిటిసి సత్యనారాయణరెడ్డి

ప్రకాశం జిల్లా జంగంగుంట్ల వద్ద శుక్రవారం రాత్రి కడప జిల్లా కాశినాయన మండలానికి చెందిన జడ్‌పిటిసి సత్యనారాయణరెడ్డికు తీవ్ర గాయాలయ్యాయి. విజయవాడ నుంచి కడపకు వెళుతూ మండలంలోని జంగంగుంట్ల దాటిన తర్వాత వేగంగా వెళుతున్న కారు అదుపుకాక కుడివైపుకు పొలాలలోకి పల్టీలు కొట్టుకుంటూ రహదారి పక్కన ఉన్న పొలంలో పడిపోయింది. క్షతగాత్రునికి మెరుగైన చికిత్స కోసం ఒంగోలు తరలించినారు.

కరువు మండలాలుగా ప్రకటించకపోవడం దారుణం

దువ్వూరు : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 1న రాష్ట్రంలోని కరువు మండలాలు జిల్లాల ప్రకటనలో కడప జిల్లా లోని మండలాలను ప్రకటిం చకపోవడం దారుణమని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎ.వి.రమణ అన్నారు. శుక్రవారం దువ్వూరు తహశీల్దార్ రమా కుమారికి రైతు సేవా సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. దువ్వూరు మండలాన్ని, కడప జిల్లా మొత్తాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలన్నారు.

In the court of the Prl. Junior Civil Judge, Ananthapuramu
I.A.No:329/2023 in O.S.No:258/2023
Between:
N.Manjunath ...Petitioner/Plaintiff
And
Rayapati Babaiah ...Respondant/ Defendant
Notice Respondant
To
Rayapati Babaiah S/o Chinna Babaiah R/of D.No:2-139, Errabelle, Kothapalli, Pulivendula Errabelle, Kadapa Dist.
పై నెంబరు పిటీషన్/ దావాలో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 08/11/2023 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
(By order of the court)
CHITTOR WAHEEDULLA KHAN,
E.SAI NATH
Advocates , Anantapuramu,
Cell:9394883009

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, KADAPA
E.A.No. 67 /2023
E.P.No. 54 /2021
O.S.No. 265 /2018
1. Penukonda Venkata Sanjeeva Murthy, S/ o Late P.Krishna Muthy aged about 84 years, Hindu, Business R/ o 15/ 176, Ballari Road, Kadapa City Kadapa District.
2. Gottimukkala Venkat Kalyan S/o G.Venkata Ramaniah aged about 33 years Hindu, Business residing at D.No.l/1812-3, Apparao Building Street, Yerramukkapalli, Kadapa City, Kadapa District.
...Petitioners
Vs
1. M/s Devi Mines and Minerals rep by its Managing partners Savaram Sreenivasulu S/ o Venkata Narayana, aged about 48 years,Hindu, Balija by caste, Managing Partner of the M/S Devi Mines &Minerals residing at D.No.1/1835-1, Gandhi Nagar, Yerramukkapalli, YSR Kadapa district.
2. Savaram Sreenivasulu S/ o Venkata Narayana, aged about 48 years, Hindu, Balija by caste, Managing Partner of the M/S Devi Mines & Minerals residing at D.No. 1/1835-1, GandhiNagar, Yerramukkapalli, YSR Kadapa district.
...Respondents No. l and 2
NOTICE TO THE RESPODNETS NO.1&2
పై దావాలోని పిటిషనర్స్‌పై E.P.లో Claim Petition దాఖలు చేసి ఉన్నారు. సదరు Claim Petitionలో మీ హాజరు నిమిత్తమై వాయిదా 29.11.2023 ఉన్నది. కావున మీరు ఆ దినం అనగా 29.11.2023 ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో స్వయముగా కాని లేదా వకీలు ద్వారా కాని హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
//By Order of the Court//
P. RAJENDRA PRASAD
Advocate for Petitioner